ప్రజాశక్తి

సోమవారం 29 సెప్టెంబర్ 2025

నగరపాలక సంస్థకు 7వ ర్యాంకు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 నగర పాలక, పురపాలక సంఘాలలో వివిధ అంశాలలో ఉత్తమ ఫలితాలకై చేపట్టిన సర్వేలో విజయ నగరం నగరపాలక సంస్థ 7వ ర్యాంకును సాధించింది. 75శాతం రేటింగ్‌తో తాడిపత్రి తొలి స్థానంలో నిలవగా 61శాతం రేటింగ్‌తో విజయనగరం నగరపాలక సంస్థ 7వర్యాంకు సాధించింది. నీటిపంపిణీ, వీధి దీపాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, రెవెన్యూ, వేస్ట్ ప్రాసెసింగ్, రహదారుల నిర్వహణ, ఆదాయ వనరుల వృద్ధి వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని రాష్ట్ర మున్సిపల్‌శాఖ ర్యాంకింగ్‌లను ప్రకటించింది. కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ అందరి సమన్వయంతో తొలి ర్యాంకు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

సిఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

పరిశీలించిన కలెక్టర్ రామసుందర్‌రెడ్డి • లోపాలు తలెత్తకూడదని అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి-దత్తిరాజేరు

అక్టోబర్ 1న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దత్తిరాజేరు మండలం దత్తిలో పర్యటించనున్న నేపథ్యంలో గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ముందుగా హెలిపాడ్ స్థలాన్ని, మ్యాప్ లను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్, ఇతర అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి యుద్ధ ప్రాతిపదికన చెత్తను తొలగించాలని, కాలువను శుభ్రం చేయాలని, రోడ్లను మరమ్మతు చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ముఖ్యమంత్రి పంపిణీ చేయనుండటంతో, లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడి వారి పేర్లను ఖరారు చేశారు. బహిరంగ సభ నిర్వహించే ప్రదేశాన్ని కలెక్టర్ సందర్శించారు. స్టేజ్ ఏర్పాట్లపై చర్చించారు. వర్షాలు పడినా ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్ కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమీపంలో ఉన్న జెడ్‌పి పాఠశాలలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎండి కవిత, ఆర్ అండ్‌బి ఎస్ఇ కాంతిమతి, పిఆర్ ఎస్ఇ శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, డిపిఒ మల్లికార్జునరావు, ఐసిడిఎస్ పీడీ విమలారాణి, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ప్రమీలా గాంధీ, ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ విజయభాస్కర్, ఆయా శాఖల ఇతర అధికారులు, కూటమి పార్టీల నాయకులు.పాల్గొన్నారు.

దత్తి గ్రామంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, జెసి సేధుమాదవ్

లోపాలు తలెత్తకుండా పని చేయాలి

కంటోన్మెంట్ : దత్తి గ్రామం లో పించన్ల పంపిణీకి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వస్తున్న నేపథ్యంలో అధికారులంతా వారికి కేటాయించిన విధులను లోపాలు తలెత్తకుండా చేయాలని కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పింఛన్ల పంపిణీ , పింఛనర్లతో ముఖాముఖి, ప్రజావేదిక, పార్టీ సమావేశం వంటి కార్యక్రమాలు ఉంటాయని, ప్రజా వేదిక వద్ద దత్తి గ్రామానికి చెందిన ప్రజలే హాజరవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి నాలుగు ఇళ్లకు వెళ్లి నలుగురుకు పింఛను పంపిణీ చేస్తారని, ఆ గృహాల వద్ద విద్యుత్ తనిఖీలు నిర్వహించాలని విద్యుత్ అధికారులకు ఆదేశించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రతి చోటా హై స్పీడ్ ఇంటర్నెట్ ఏర్పాటు చేయాలని ఎన్ఐసి అధికారులకు ఆదేశించారు. బందోబస్త్, సెక్యూరిటీ , రోప్ పార్టీ, పార్కింగ్ తదితర ఏర్పాట్లన్నీ పోలీస్ వారు జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. సమావేశం లో సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్, డిఆర్ఓ శ్రీనివాస మూర్తి, ఆర్‌డిఒలు, వేదికల ఇంఛార్జి అధికారులు, ముఖ్యమంత్రి పర్యటన లో డ్యూటీ వేసిన అధికారులు, సిబ్బంది ప్రల్గొన్నారు.

హెలిప్యాడ్ ఏర్పాటుకు చదును చేస్తున్న స్థలం

నిర్లక్ష్యమా! వ్యూహాత్మకమా?

డ్వామా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- **డిగ్రీ కాలేజీ నెల్లిమర్లకు తరలింపు వెనుక మర్మమేమిటో?**
- **అవస్థలు పడుతున్న విద్యార్థులు**

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నెల్లిమర్లకు తరలించడం వెనుక నిర్లక్ష్యమా...! లేక వ్యూహాత్మకంగానే తరలించారా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. కారణం ఏదైనా స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు బాధ్యత వహించాల్సిందేనన్న చర్చ కూడా నడుస్తోంది. లేదంటే అందుకు తగ్గ పర్యావసానాలు కూడా ఎదురయ్యే అవకాశం లేకపోలేదు.

విద్యల నగరంగా పేరుగాంచిన విజయనగరంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ 2019 వరకు లేదు. కాదు... కాదు.... ఇప్పటికీ లేనట్టే...! ఇందుకు కారణం లేకపోలేదు. విజయనగరం మహారాజా డిగ్రీ కళాశాల 1879 లోనే ఏర్పాటైంది. ఇది దక్షిణ భారత దేశంలోనే తొలి కళాశాలగా చరిత్రకెక్కింది. దీని తరువాత ఇంతటి స్థాయిగల కాలేజీ మద్రాసులోనే ఉండేదట అప్పట్లో. ఈ రెండు కాలేజీల్లో ఉన్న కోర్సులు కూడా దక్షణాది రాష్ట్రాల్లో మరెక్కాడా అప్పట్లో లేవనే రికార్డు కూడా ఉండేది. అందుకే ఎంఆర్ కళాశాలలో చదువుకున్న ఎంతోమంది అన్ని రంగాల్లోనూ ఉన్నత శిఖరాలను అవరోధించారు. ఇక్కడ తొలుత ఉచితంగా చదువు చెప్పేవారు... ఆ తరువాత ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (ఎయిడెడ్)తో నడిచేది. పదేళ్ల క్రితం వరకు నామమాత్రపు ఫీజులతో విద్యాబోధన చేశారు. ఇంతటి కళాశాల ఉండడం వల్లే విజయనగరం జిల్లా కేంద్రానికి ప్రత్యేకంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవసరంగానీ, డిమాండ్‌గానీ లేకుండా పోయింది. కానీ, పదేళ్ల క్రితం ఎంఆర్ కళాశాల పాలకుల పుణ్యమా అని పూర్తిగా ప్రైవేటు పరం చేశారు. ఎయిడ్‌ను తొలగించారు. మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్‌గా ఈ పనికి పూసపాటి అశోక్‌గజపతిరాజు పూనుకున్నప్పటికీ, ప్రతిపక్షం, లేదా అధికార పక్షంలోవున్న నేతలు కనీసం ప్రశ్నించలేదు. ఈ సంగతి అటుంచితే.... ఓవైపు ఎంఆర్ కాలేజీ ప్రైవేటీకరణ అవుతున్న నేపథ్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అవసరాన్ని ఎస్ఎఫ్ఐ (భారత విద్యార్థి ఫెడరేషన్) గుర్తించింది. ఓవైపు ఎంఆర్ కాలేజీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూనే మరోవైపు ప్రభుత్వ డిగ్రీ కాలేజీని మంజూరు చేయాలని ప్రభుత్వాలపై ఒత్తిడి చేసింది. ఎట్టకేలకు 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వమే డిగ్రీ కాలేజీని మంజూరు చేసింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం శాశ్వత భవనం ఏర్పాటు చేయలేదు. ఇందుకోసం టిడిపి కూడా నిలదీయలేదు. దీంతో, నాటి నుంచి నేటి వరకు స్థానిక మహారాజా ప్రభుత్వ సంస్కృత కాలేజీలో షిఫ్టుల పద్ధతిలో తరగతులు నడిపారు. ఎంఆర్ కాలేజీలో ఫీజుల భారం భరించలేని పేద విద్యార్థులంతా ప్రభుత్వ డిగ్రీ కాలేజీవైపు వచ్చారు. క్రమంగా విద్యార్థుల సంఖ్య 370కి చేరింది. ఎన్నో అసౌకర్యాల మధ్య కళాశాల నిర్వహణ సాగుతున్నప్పటికీ 2023-24 విద్యాసంవత్సరంలో 98శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎనిమిది మేజర్ కోర్సులతో ప్రారంభమైన కళాశాలలో నేడు 10మేజర్ కోర్సులు ఉన్నాయి. ఇందులో భౌతిక శాస్త్రం, బోటనీ మేజర్‌కోర్సులకు ఈనెల 24న ఉన్నతవిద్యాశాఖ అనుమతిచ్చింది. ఇంతటి నేపథ్యం, చారిత్రక, అవసరం ఉన్న కళాశాలలకు శాశ్వత భవనం నిర్మించాలని, ఇందుకోసం స్థలం కేటాయించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు ఆందోళనలు చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు, జిల్లా కలెక్టర్‌కు ఎన్నోసార్లు వినతిపత్రాలు సమర్పించారు. చివరకు ఉన్నత విద్యాశాఖ కూడా నగరంలో అద్దె భవనం తీసుకుంటే ప్రభుత్వం తరపున బిల్లులు చెల్లిస్తామని కూడా చెప్పారు. స్థలానికిగానీ, అద్దె భవనానికి గానీ, ఎమ్మెల్యే కనీసం పట్టించుకోలేదు. కలెక్టర్‌పై ఒత్తిడి పెరగడంతో నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రంలోని ఖాళీగావున్న డ్వామా భవనాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈనేపథ్యంలో ఈనెల 24న విజయనగరంలోని సంస్కృత కళాశాల నుంచి నెల్లిమర్లకు కళాశాల తరలిపోయింది. దీంతో, విజయనగరం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ తరపున కళాశాల అంటూ లేకుండా పోయింది. దీంతో, ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ అద్దెగదులు తీసుకుని చదువుకుంటున్న విద్యార్థులు తిరిగి విజయనగరం నుంచి నెల్లిమర్లకు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. చివరకు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత విద్య అందుబాటులో లేకుండా పోయింది. ఈ సంగతి కాస్త అటుంచితే... తన నియోజకవర్గానికి మంజూరైన కళాశాల పట్ల స్థానిక ఎమ్మెల్యే ఎందుకు నిర్లక్ష్యం చూపారు? ఆమె తండ్రి చైర్మన్‌గావున్న మాన్సాస్ ట్రస్ట్ పరిధిలోని ఎంఆర్‌కాలేజీపై చూపిన శ్రద్ధ ప్రభుత్వ కాలేజీపై ఎందుకు చూపడం లేదు? ఒక వేళ ఉచితంగా విద్యనందించే ప్రభుత్వ కాలేజీ స్థానికంగా ఉంటే ఎంఆర్‌కాలేజీ అడ్మిషన్లు తగ్గుతాయనే భయం ఏమైనా ఉందా? అని జనం నుంచి సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఆమె కూడా అందుకు తగ్గట్టే కనీసం స్థానికంగా అద్దె భవనాన్ని కూడా చూడకపోవడం చర్చనీయాంశంగా మారింది.

విజేతలకు బహుమతి అందజేస్తున్న రిఫరీలు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శంకర్రావు, గురుప్రసాద్

భగత్‌సింగ్, గాంధీ ఆశయ సాధనకు కృషి

• జయంతి కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు • ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భగత్‌సింగ్, గాంధీ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆదివారం స్థానిక అయోధ్య మైదానంలో నిర్వహించారు. ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ ప్రసన్న కుమార్ ఈ పోటీలను ప్రారంబించారు. ముందుగా భగత్ సింగ్, గాంధీజి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పోటీలను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ భగత్ సింగ్, గాంధీజీలు ఆదర్శనీయులన్నారు. నిరంతరం విద్యార్థులు సమస్యలపై పనిచేస్తూ విద్యార్థులలో సామాజిక ఆలోచన కలిగించే విధంగా పోటీలు, పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకత్వాన్ని అభినందించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ దేశభక్తి యుత్తమైన విద్యార్థి సంఘమన్నారు. దేశంలో చదువుకునేందుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా, పేద విద్యార్థులకు చదువు అందాలనే ఉద్దేశంతో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డివైఎఫ్ఐ పోరాడుతోందన్నారు. ఎటువంటి ప్రజాస్వామ్య, లౌకిక దేశం కోసం భగత్ సింగ్, గాంధీజీలు పోరాడారో దాన్ని కాపాడుకునేందుకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నిరంతరం కృషి చేస్తున్నాయని అన్నారు. అనంతరం పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలోనిలిచిన జెఎన్‌టియు జివి టీమ్‌కు రూ.10వేలు, రెండోస్థానం సాధించిన రాజాం టీమ్‌కు రూ.5వేలు నగదు బహుమతిని రిఫరీలు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవికుమార్, రమేష్, జగదీష్, నాయకులు ,క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి

కంటోన్మెంట్ : రెపరెపలాడే విప్లవ పతాక భగత్‌సింగ్ అని, దేశం కోసం ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్ స్ఫూర్తి ప్రదాత అని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్ష కార్యదర్శులు సముద్రాల గురు ప్రసాద్, డాక్టర్ జక్కు రామకృష్ణ, సిపిఎం నాయకులు రెడ్డి శంకర్రావు పేర్కొన్నారు. తెలుగు భాషాపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురజాడ స్వగృహంలో జరిగిన భగత్ సింగ్ జయంతి కార్యక్రమంలో ముందుగా భగత్ సింగ్ చిత్ర పటానికి మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. శంకరరావు మాట్లాడుతూ బ్రిటీష్ వారిని భగత్ సింగ్ ఎదిరించిన తీరును, తన ప్రాణాన్ని పణంగా పెట్టి భారతీయులలో ఏ విధంగా చైతన్యం నింపారో వివరించారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు కాగుపాటి నారాయణమూర్తి, గురజాడ కుటుంబీకులు ఇందిర, వెంకటేశ్వర ప్రసాద్ దంపతులు, మేమున్నాం సంస్థ సభ్యులు కంది సత్యన్నారాయణమూర్తి, డోకి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన...

స్వతంత్ర సమర యోధుడు భగత్ సింగ్ 118వ జయంతిని అమర్ భవన్‌లో సిపిఐ ఆధ్వర్యాన నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలను వేసి నివాళుల ర్పించారు. ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాల న్నారు.

11 వేదికల్లో ఉత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ఉత్సవాలను 11 వేదికల్లో నిర్వహిస్తున్నామని, ప్రతి వేదిక వద్ద ఘనంగా జరపాలని వేదికల ఇంచార్జ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం ఉత్సవ వేదికల ఇన్‌చార్జి అధికారులతో ఏర్పాట్ల పై వేదిక వారీగా సమీక్షించారు. ఉత్సవాల పని పై దృష్టి పెట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని తెలిపారు. లైఫ్ సభ్యులతో మాట్లాడుకొని, ఉత్సవ ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని అన్నారు. సమావేశం లో సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్ , డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, ఆర్‌డిఒలు, వేదికల ఇంఛార్జి అధికారులు పాల్గొన్నారు.

సరస్‌లో లక్కీ డీప్ ద్వారా షాపుల కేటాయింపు

సెర్ప్-డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో మాన్సాస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న సరస్‌లో లాటరీ ద్వారా ఆదివారం షాపులను కేటాయించారు. అక్టోబర్ 8వరకు నిర్వహిస్తున్న అఖిల భారత డ్వాక్రా బజారుకు పెద్ద ఎత్తున మహిళా సంఘాలు ఉత్పతుల ప్రదర్శన , అమ్మకానికి వచ్చినట్లు డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి తెలిపారు. ఆదివారం వచ్చిన వారందరికీ ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొని, లక్కీడీప్ ద్వారాస్టాల్స్ కేటాయిస్తామని తెలిపారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు ఈ సరస్‌ను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, ఎంఎస్‌ఎంఇశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు.

మెడికల్ కాలేజీలు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నడపాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెడికల్ కాలేజీలను ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నడపాలని ఎఐఎఫ్‌టియు నాయకులు రెడ్డి నారాయణరావు, అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీ పార్కు నుండి గంటస్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పి పి పి విధానాన్ని రద్దు చేసి అన్ని మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. ప్రజలందరికీ సూపర్ స్పెషలిటీ వైద్య సేవలను ప్రభత్వమే అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.కార్యక్రమంలో గుజ్జురు శంకరరావు, ఆర్. గోవింద, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మీ కోసం కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సోమవారం ఉదయం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రామ సుందర్ రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోను చెక్ చేసుకోవచ్చన్నారు. నోటీసులు, ఎండార్స్‌మెంట్‌ను వాట్సాప్‌లో అందజేస్తున్నామని, ఎండార్సుమెంట్‌ను రిజిస్టర్ పోస్ట్ ద్వారా సంబంధిత చిరునామాకు పంపిస్తున్నామని చెప్పారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి

అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

మాపై బురద జల్లితే ఊరుకోం

• నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి

• వేషాలేస్తే తాటతీస్తాం • విలేకర్లకు లోకం ప్రసాద్ హెచ్చరిక

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఈ ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ఆలోచనలో తాము ఉంటే మమ్మల్ని రాజకీయ కక్షతో వ్యక్తిగతంగా బురదజల్లే ప్రయత్నం జరగడం బాధాకరమని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ఆదివారం భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు ఆమె భర్త లోకం ప్రసాద్ మాట్లాడారు. తమపై కొంతమంది 100 రోజుల్లో వంద కంపెనీలు తెస్తానన్నారని సోషల్ మీడియాలో తరచూ ట్రోల్ చేయడం మంచిది కాదన్నారు. దానిపై నేను స్పందించకపోవడం చేతగాని తనం అని అనుకుంటే పొరపాటే అని ఎమ్మెల్యే అన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసిపి నేతలు ధోరణి మార్చుకోవాలని మీడియా ద్వారా తెలియజేస్తున్నానన్నారు. మీ పాలనలో ఐదేళ్ల అయ్యో ఆంధ్రప్రదేశ్ అనేలా చేసారన్నారు. ఇలాంటి తరుణంలో 100 రోజుల్లో వంద కంపెనీలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. పన్నులు ఎగ్గొట్టిన ఎమ్మెల్యే అంటూ పత్రికల్లో వార్తలు రాయడం బాధాకరమన్నారు. నామినేషన్ వేసే ముందు అన్ని డిపార్ట్ మెంట్‌లకు పన్నులు కట్టిన తరువాత నామినేషన్ వేశామన్నారు. ఫైర్ స్టేషన్ ఆపాలని ప్రయత్నాలు జరిగినా ప్రజలకు ఉపయోగం అని గుర్తించి చేసామన్నారు. స్వప్రయోజనాలు కోసం అధికార దుర్వినియోగం చేస్తే ఊరుకోమని తెలిపారు. తమపై బురద జల్లుతూ వార్తలు రాస్తే ఊరుకోబమని హెచ్చరించారు.

మీడియాపై లోకం ప్రసాద్ చిందులు

ఎమ్మెల్యే భర్త లోకం ప్రసాద్ మాట్లాడుతూ మీడియాపై చిందులు వేశారు. వేషాలేస్తే తోలు తీస్తామంటూ విలేకర్లను హెచ్చరించారు. భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్లలో ఎంపిపి భర్తలు ఎంపిపి ఛాంబర్‌లో కూర్చొని పాలన చేస్తుండడం కనిపించడం లేదా అన్నారు. ఎన్ని వార్తలు రాసినా పత్రికలకు భయపడేది లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కొమ్మూరు అప్పడదొర దగ్గర పనిచేసేవాడని, నేడు రూ.100 కోట్లు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. దాని వెనుక చెరువులు, భూముల కబ్జాలు గురించా రాయండి అంటూ విలేకర్లకు సూచించారు.

ఇఎస్ఐతో అనేక ప్రయోజనాలు

- **అక్టోబర్ 1నుంచి కేసులు సెటిల్ మెంట్**
- **ఇఎస్ఐలో 74వేల మంది నమోదు**
- **డిసెంబర్ 31 వరకు ఎటువంటి ఫెనాల్టీలు లేకుండా కార్మికుల నమోదుకు అవకాశం**
- **'ప్రజాశక్తి'తో ఇఎస్ఐ విజయనగరం జిల్లా మేనేజర్ జీవరత్నం ముఖాముఖి**

ప్రజాశక్తి - కంటోన్మెంట్

కార్మిక రాజ్య బీమా సంస్థ (ఇఎస్ఐ) ద్వారా కార్మికులకు అనేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు విజయనగరం కార్మిక రాజ్య బీమా సంస్థ మేనేజర్ గొంటి జీవరత్నం తెలిపారు. 10 కంటే ఎక్కువమంది సంస్థ, కర్మాగారంలో కార్మికులు పనిచేస్తే ఇఎస్ఐలో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది జూలై 1 నుండి డిసెంబరు 31 వరకు ఇఎస్ఐ లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. కోర్టులో కేసులు వేసిన కార్మిక సంస్థలు కేసులను వచ్చే నెల అక్టోబర్ 1 నుంచి ఏడాది పాటు సెటిల్ చేసుకొని అవకాశాన్ని కల్పించిందన్నారు. ఎవరైతే ఇరవై ఒక్క వేలు, అంతకంటే తక్కువ జీతం వస్తుందో వారు ఇఎస్ఐలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాశక్తికి ముఖాముఖి ఆయన ఇంటర్యూ ఇచ్చారు. ఇఎస్ఐలో నమోదు చేసుకున్న కార్మికులకు ఎటువంటి ఉపయోగాలు ఉన్నాయో వివరించారు.

? ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎన్ని కంపెనీల నుంచి ఎంతమంది కార్మికులు నమోదై ఉన్నారు?

జిల్లాలో కార్మిక రాజ్య బీమా సంస్థ కార్యాలయాలు విజయనగరం, గరివిడిలో ఉన్నాయి. డిస్పెన్సరీలు కొత్తవలస, బొబ్బిలి, నెల్లిమర్ల, గరివిడిలో ఉన్నాయి. విజయనగరం పరిధిలో 1850 సంస్థలు, కంపెనీల పరిధిలో 62వేల మంది, గరివిడి ఇఎస్ఐ పరిధిలో 450 సంస్థలు, కంపెనీల నుంచి 12వేల మంది కార్మికులు ఉన్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో డయాగ్నోస్టిక్ సెంటర్ ఉంది. పది పడకల ఆసుపత్రిని నిర్మించారు. ఇఎస్ఐ లో నమోదైన కార్మికులందరూ ఈ డిస్పెన్సరీలో వైద్య సేవలు పొందవచ్చు.

? ఇఎస్ఐలో కేసుల సెటిల్మెంట్లకు ఏమైనా విధానాలను తీసుకువచ్చిందా ?

ఇఎస్ఐ సంస్థ కంపెనీ యాజమాన్యాలపైగాని, కంపెనీ యాజమాన్యాలు ఇఎస్ఐపై గాని కోర్టుల్లో కేసులు వేసి ఎప్పటికీ సెటిల్మెంట్ కాకుండా ఉన్న కేసులను కోర్టు వెలుపల ఇఎస్ఐ ఆఫీసుల్లో విశాఖపట్నంలో సెటిల్మెంట్ చేసుకునే అవకాశం కల్పించింది. ఇఎస్ఐ సబ్ రీజినల్ ఆఫీసు విశాఖపట్నంలో సంప్రదించాలి. ఈ అవకాశం అక్టోబర్ 1 నుంచి వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వరకు ఏడాది పాటు ప్రభుత్వం కల్పించింది.

? ఎవరు ఇఎస్ఐలో నమోదు చేసుకోవచ్చు.?

పదిమంది కంటే ఎక్కువ మంది పనిచేసే సంస్థలు, కార్యాలయాలు వారిని ఇఎస్ఐలో నమోదు చేయాల్సి ఉంది. ఇఎస్ఐ లో నమోదు కాని కార్మికులకు ప్రభుత్వం ఎస్‌పిఅర్ఇఇ అనే పథకాన్ని తీసుకువచ్చింది. (స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్ అండ్ ఎంప్లాయిస్) ఈ పథకం ద్వారా జూలై 1 నుండి డిసెంబర్ 31 వరకు నమోదు చేసుకుని అవకాశాన్ని కల్పించింది. సంస్థలో కర్మాగారంలో పనిచేస్తూ ఇఎస్ఐ లో నమోదు కాని కార్మికులకు ఈ అవకాశం లభిస్తుంది. సోషల్ సెక్యూరిటీ అధికారి తనిఖీ చేసి గత సంవత్సరములు కవర్ చేసి కంట్రిబ్యూషన్ ఇంట్రెస్ట్ డ్యామేజెస్ , లీగల్ యాక్షన్ లేకుండా ఈ స్కీము ద్వారా నమోదు చేసుకోవచ్చు. సంస్థల్లో పనిచేస్తూ ఇఎస్ఐలో నమోదు కాని కార్మికులకు ఈ అవకాశం ఉంటుంది. ఆయా సంస్థలపై చర్యలు ఉండవు.

? ఇఎస్ఐలో కార్మికులకు ప్రయోజనాలు ఏమిటి.?

ఇఎస్ఐలో నమోదు చేసుకున్న కార్మికులకు మెడికల్‌గా మూడు రకాలు వైద్యసేవలు అందిస్తారు. మెడికల్ సిక్‌నెస్, మెటర్నిటీ డిజేబుల్, డిపెండెంట్ బెనిఫిట్స్‌ను నగదు రూపంలో ఐదు రకాలుగా అందిస్తారు. కార్మికుడు ఆరు నెలలు పాటు డ్యూటీకి వెళ్లిన వెళ్లలేని పరిస్థితుల్లో ఇఎస్ఐ డిస్పెన్సరీ వైద్యంతో పాటు మెడికల్ లీవ్ సర్టిఫికెట్స్ ఇస్తారు. అటువంటి లీవులకు 70శాతం జీతం ఇఎస్ఐ చెల్లిస్తుంది. కేన్సరు కేటరాక్టు తదితర 34రకాల వ్యాధులకు రెండేళ్ల పాటు జీతంలో 80శాతం ఇఎస్ఐ చెల్లిస్తుంది. ట్యుబెక్టమీకి 14 రోజులు, వ్యాసెక్టమీ ఆపరేషన్లకు 7 రోజులు పాటు 100 శాతం జీతం అందిస్తారు. మహిళా కార్మికులకు తొమ్మిది నెలలు పనిచేసిన వారికి 70రోజులు పాటు పని చేసిన కార్మికులకు రెండు డెలివరీలకు 182 రోజులు మెటర్నిటీ లీవులతో పాటు పూర్తి వేతనం చెల్లిస్తారు. గర్భస్రావం జరిగితే 42 రోజుల పాటు 100శాతం జీతం అందిస్తారు. సరోగసి దత్తత తీసుకోవడం వంటి వాటికి 80 రోజులు పాటు 100శాతంజీతం అందిస్తారు.

? కార్మికులు గాయపడినా, మృతి చెందినా ఎటువంటి సదుపాయాలు కల్పిస్తారు?

విధి నిర్వహణలో గాని, ఇంటి నుండి విధులకు వెళ్లే సమయంలో గాని, పని ముగించుకుని ఇంటికి వచ్చే సమయంలో గాని ప్రమాదాలు జరిగితే సెలవులో ఉన్నంతవరకు జీతంలో సగం ఇఎస్ఐ చెల్లిస్తుంది. సెలవులు పూర్తయిన తర్వాత వారి శాశ్వత అంగవైకల్యం కలిగితే మెడికల్ బోర్డు ద్వారా నిర్ధారించి లాస్ ఆఫ్ ఎర్నడ్ కెపాసిటీ గుర్తించి నెలవారి పింఛను అందిస్తారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మృతిచెందితే అతని కుటుంబానికి జీతం 90 శాతాన్ని పింఛన్‌గా నిర్ధారించి కుటుంబ సభ్యులకు తగిన వాటాల రూపంలో అందిస్తారు వారి భార్యకు జీవితాంతం, మగ పిల్లలకు 25శాతం ఆడపిల్లలకు పెళ్లయినంతవరకు చెల్లిస్తారు. కార్మికులు సాధారణంగా మతి చెందితే దహన ఖర్చులు రూ.15వేలు అందిస్తారు. ఇఎస్ఐ ఫెసిలిటీస్ లేనిచోట ప్రసవాలు జరిగితే రూ.7000 చొప్పున రెండు ప్రసవలకు అందిస్తారు. కార్మికులు రిటైర్ అయిన లేదా వాలంటీర్ గా రిటైర్మెంట్ తీసుకున్నా, కర్మాగారం మూతపడి ఉద్యోగం పోయిన సమయానికి ఐదేళ్ల ముందు వరకు ఇఎస్ఐలో రూ.10 చొప్పున చందా చెల్లించి ఉంటే కార్మికుడికి లేదా అతని భార్యకు ఏడాది పాటు మెడికల్ వైద్య సేవలు అందుతాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com

కార్మికుల ఉపాధి కాపాడండి

ప్రజాశక్తి - గరివిడి

మండలంలోని దేవాడ, సదానందపురం మైన్స్ లీజులను పునరుద్ధరించి 503 మంది కార్మికుల ఉపాధిని కాపాడాలని సిఐటియు నాయకులు ఎ.గౌరి నాయుడు డిమాండ్ చేశారు. డివిఎస్ ఏరియాలో సిఐటియు ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరవధిక దీక్ష ఆదివారంతో 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఆకలితో అలమటిస్తున్నారని సదరు యాజమాన్యం వారికి అండగా నిలబడి న్యాయం చేయాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో మహిళా కార్మికులు పత్తికుల రాములమ్మ, పొట్నూరు జయలక్ష్మి, నాజాన బంగారమ్మ, డి నారాయణమ్మ, వాసుపల్లి సూరమ్మ, నేలతి సూరప్పమ్మ, మైన్స్ నాయకులు సన్యాసినాయుడు, సాంబ, వీరభద్రం, బూరి సత్యం, లంక రాజు, చలపతి కామునాయుడు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మైన్స్ కార్మికులు

టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత చంద్రబాబుదే

శృంగవరపుకోట: 150 రోజుల్లోనే టీచర్ల భర్తీ ప్రక్రియను పూర్తి చేసి నియామక పత్రాలు కూడా అందించిన ఘనత చంద్రబాబు దేనని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం లక్కవరపుకోటలోని టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 16 వేల టీచర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడమే ఒక చరిత్ర.. ఇంత తక్కువ టైంలో ప్రక్రియ పూర్తి చేసి, నియామక పత్రాలు ఇవ్వటం మరో చరిత్ర అని ఇది కేవలం లోకేష్, చంద్రబాబుకి మాత్రమే సాధ్యమని చంద్రబాబు చెప్పాడంటే, చేస్తాడని, మెగా డిఎస్సితో ఇది మరోసారి రుజువైందని అన్నారు. ఈ సమావేశంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, పిఎసిఎస్ చైర్మన్ జివిఎస్ నాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ ఆదిబాబు, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్దిల రాము పేరిట రక్త దానం

నెల్లిమర్ల: జరజాపు పేటలో యువకుడు, కీర్తి శేషులు మద్దిల రాము పదో వర్ధంతి సందర్భంగా ఆదివారం గాంధీరాం ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ, సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 38 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు రాము చిత్ర పటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన జ్ఞాపకాలను స్మరించుకుంటూ గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు రక్తదాన శిబిరంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గరివిడి, గుర్ల, బొబ్బిలి ఎంఇఒలు పోలుబోతు రామారావు, ఎస్ భానుప్రకాష్, సిహెచ్ రమేష్ కుమార్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, అవనాపు సత్యనారాయణ, నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, మద్దిల వాసు, పోలుబోతు నారాయణమూర్తి, కాళ్ల రాజశేఖర్, మద్దిల రాజారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పునర్నిర్మాణం పై హర్షం

శృంగవరపుకోట : స్థానిక ఆర్టిసి కాంప్లెక్సు ఎదురుగా గల వీధి కల్వర్టును నెలన్నర రోజుల్లో రెండుసార్లు కూల్చివేయడాన్ని స్థానికులు అడ్డుపడి సకాలంలో పునర్నిర్మిస్తామంటేనే గుత్తేదారునికి సహకరిస్తామని ఆందోళన చేసిన విషయం విదితమే. యిచ్చిన మాట ప్రకారం సకాలంలో గుత్తేదారుడు రెడ్డి వెంకన్న కల్వర్టును రెండు వారాలలో పునర్నిర్మించి రాకపోకల అంతరాయం నుండి విముక్తి కల్పించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సిసి కెమెరాల ఏర్పాటుతో నిఘా పటిష్టం

నెల్లిమర్ల: సిసి కెమెరాలు ఏర్పాటుతో నిఘా మరింత పటిష్టంగా ఉంటుందని ఎస్ఐ బి.గణేష్ అన్నారు. ఆదివారం కొండవెలగాడలో దంతలూరి అజయ్ బాబు, మొయిద సత్యనారాయణ ఆర్థిక సహాయంతో ఆటో స్టాండ్ ప్రధాన కూడలి వద్ద 2 సిసి కెమెరాలు, పైడితల్లి అమ్మవారి టెంపుల్ దగ్గర 2 కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ మధ్యకాలంలో కొండవెలగాడ గ్రామం విజయనగరం పట్టణానికి దగ్గరగా ఉండటం వల్ల కొంతమంది ఆకుతాయిలు తరచుగా ఈ గ్రామానికి వస్తున్నట్టుగా సమాచారం ఉండడంతో, అలాంటి ఆకుతాయిలకు, ఇతర అసాంఘిక కార్యక్రమాలకి ముకుతాడు వేయడానికి ఈ కెమెరాలు ఎంతో సహాయపడతాయని ఎస్ఐ గణేష్ తెలిపారు.

గ్రంథాలయానికి వితరణ

వేపాడ: మండల శాఖా గ్రంథాలయానికి వల్లంపూడికి చెందిన శ్రీశ్రీశ్రీ సీతారామ యువజన సేవాసంఘం సభ్యులు ఆదివారం రెండు కంప్యూటర్ టేబుల్స్, మూడు బుక్ రాక్స్, గ్రూప్ -1,2లకు సంబంధించిన అన్ని రకాల కాంపిటేటివ్ పుస్తకాలను వితరణగా బహూకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ గ్రంథాలయానికి బెంగుళూరుకు చెందిన శివశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ప్రతి ఒక్కరికీ డిజిటల్ లిటరసీ పెంపొందించడం కోసం తమ సంస్థ ద్వారా రెండు కంప్యూటర్లు, ఒక ఆండ్రాయిడ్ టివి, ఒక స్మార్ట్ మొబైల్ను అందించారన్నారు. అనంతరం గ్రంథాలయ ఆవరణంలో సంస్థ సభ్యులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా సండేస్ ఆన్ సైక్లింగ్

డెంకాడ: చింతలవలస వద్ద 5వ బెటాలియన్లో ఫిట్ ఇండియా ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమాండెంట్ సి.రాజారెడ్డి మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల ఆరోగ్యం కాపాడుకోవటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని అన్నారు. సైకిల్ వాడకం వల్ల శరీరానికి తగిన వ్యాయామం లభించి, మానసికంగా ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు డాక్టర్ వి.రమణమూర్తి, ఎం.గోపాలకృష్ణ, యూనిట్ ఆర్ఎస్ఐ, పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ఆదుకుంటాం:ఎమ్మెల్యే

నెల్లిమర్ల: చిరు వ్యాపారులను ఆదుకుంటామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కళ్యాణ మండపంలో పిఎం స్వానిధి లోక్ కళ్యాణ్ మేళా ఆదివారం మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న చిన్న వ్యాపారస్థులను ఆదుకోవడానికి పిఎం స్వానిధి లోక్ కళ్యాణ్ పథకం ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా వీధి వ్యాపారస్థులకు రూ.2.69కోట్లు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. రుణాలు సకాలంలో చెల్లిస్తే వారికి వడ్డీ రాయితీ ఇచ్చి రుణాన్ని పెంచుతారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ టి.జయరాం, మెప్మా సిఎంఎం గేదెల రాము, తదితరులు పాల్గొన్నారు.

కొత్త సొబగులతో మూడులాంతర్లు

విజయనగరం టౌన్ : కళలకు కాణాచి, సాంస్కృతిక రాజధానిగా భాసిల్లుతున్న విజయనగరంలోని మూడులంతర్ల జంక్షన్ కొత్త సొబగులతో శోభిల్లుతోంది. చరిత్ర కలిగిన మూడు లాంతర్లను మరింత శోభాయమానంగా తీర్చిదిద్దారు. జిల్లాలోని వివిధ రంగాలలో సంగీత, సాహిత్య సేవలలో శిఖరాగ్ర స్థానాల్లో నిలిచిన పలువురు ప్రముఖుల చిత్రాలను నిత్య ప్రదర్శనగా నిలిపే ఉద్దేశంతో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య దీన్ని తీర్చిదిద్దారు. సాయంత్రం వేళలో విద్యుత్ కాంతులతో తేజోమూర్తుల చిత్రాలు చూపరులను కట్టిపడేస్తోంది. మహాకవి గురజాడ, హరికథ పితామహుడు ఆదిభట్ల, సహజ కవి ఆరుద్ర, కథ రచయిత చాసో, సినీ గానశాల ఘంటశాల, గాన కోకిల పి.సుశీల, బుర్రకథ స్టార్ కుమ్మరి మాస్టారు, ఆంధ్రజాలరి సంపత్ కుమార్, జజ్జనకరిగా ప్రసిద్ధుడు వంగపండు, వాయులీనానికి ద్వారం వెంకటస్వామి నాయుడు, సంగీతానికి స్ఫూర్తి నేదునూరి కృష్ణమూర్తి, రసాలురు సాలూరు రాజేశ్వరరావు వంటి మహా ఉద్దండుల చిత్రమాలికలను నలుమూలల ప్రదర్శించేలా అమర్చిన తీరు అబ్బురపరుస్తోంది.

డిఫెన్స్ వెటరన్ కార్డు ఇవ్వాలి

బొబ్బిలి: తెల్లరేషన్ కార్డు మాదిరిగానే మాజీ సైనికులకు డిఫెన్స్ వెటరన్ కార్డు ఇవ్వాలని మాజీ సైనికులు కోరారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం గౌరవ అధ్యక్షులు మరడ రామినాయుడు ఆధ్వర్యంలో అధ్యక్షులు రేవళ్ల కిరణ్ కుమార్ పర్యవేక్షణలో బొబ్బిలి పాత కోటలో గల సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. మాజీ సైనికుడు ఎన్ పాపారావు మాట్లాడుతూ మాజీ సైనికులకు పెన్షన్ అందుతుందనే కారణంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలూ లభించడం లేదని, మాజీ సైనికుల కోసం ప్రత్యేక డిఫెన్స్ వేటరన్ కార్డును తెల్ల రేషన్ కార్డు స్థానంలో ఇప్పించాలని, ఈ విషయంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. కార్యదర్శి గోవింద నాయుడు, జాయింట్ కార్యదర్శి మోహన్ రావు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

- వారికి జరిగిన అన్యాయాలపై అందులో నమోదు
- వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

వైసిపి అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విడుదల చేసిన డిజిటల్ బుక్ వైసిపి కార్యకర్తలకు శ్రీరామరక్షని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ బుక్ను శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురవుతున్న కార్యకర్తలకు అండగా నిలవడానికే 'డిజిటల్ బుక్' ఓపెన్ చేశామన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి నియోజకవర్గ కేంద్రాల్లో, 29వ తేదీన మండల స్థాయిలో 'డిజిటల్ బుక్' ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. ప్రజాప్రభుత్వం అంటే సంక్షేమం, అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని, కానీ చంద్రబాబు కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. వైసిపి హయాంలో పనిచేసిన అధికారులపై అక్రమ కేసులు పెడుతూ అరాచకంగా వ్యవహరిస్తున్నారన్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసు పెట్టారని తెలిపారు. వివరక పోలీసుల తీరుపై మండిపడుతూ అక్రమ కేసులను సిబిఐకి అప్పగిస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఎన్నిసార్లు కోర్టుల అక్షింతలు వేస్తున్నా ఈ ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదని అన్నారు. వైసిపిలో ఇక్కడ కార్యకర్తలకే పెద్దపీట ఉంటుందని, కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అధికారులపై భవిష్యత్లో చర్యలు ఖాయమన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల మాటలు విని ముందుకెళ్తే భవిష్యత్లో ఎక్కడ ఉన్నా చట్టం ముందు నిలబెడతామన్నారు. ఎవరికి అన్యాయం జరిగినా 'డిజిటల్ బుక్'లో నమోదు చేస్తున్నామని, అధికారంలోకి రాగానే అందరిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని చెప్పారు. బాధితులు ఎవరైనా సరే 'డిబి.డబ్ల్యుఇవైఎస్ఆర్సిపి.కాం' అనే వెబ్సైట్లో నమోదు చేయవచ్చని తెలిపారు. 040-49171718 నంబర్కు కాల్ చేసి ఫిర్యాదు చేయచ్చునన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నెక్కల నాయుడు బాబు, వర్రి నరసింహ మూర్తి, గదుల సత్య లత, పీరు బండి జైహింద్ కుమార్, మజ్జి సిరి సహస్ర, గొర్లె రవికుమార్, ఇప్పిలి అనంతం పాల్గొన్నారు.

విజయనగరం: డిజిటల్ బుక్ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

డెంకాడ: కూటమి పాలనలో వైసిపి కార్యకర్తలు, నాయకులపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, దాడులను అరికట్టేందుకు మాజీ ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడు ఆదివారం డిజిటల్ బుక్ను ఆవిష్కరించారు. మండలంలోని పినతాడివాడ సర్పంచ్ లంక లక్ష్మణరావు గృహం వద్ద నియోజకవర్గ స్థాయిలో డిజిటల్ బుక్ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వైసిపి అధికారంలోనికి వచ్చిన తర్వాత వైసిపి వారిపై దాడి చేసినా అక్రమ అరెస్టు చేసినా చర్య ఉంటాయన్నారు. ఈ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ను సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేయించుకోవాలన్నారు. కార్యకర్తను గాని నాయకున్ని గాని అధికారులు, ఇతర పార్టీ నాయకులు ఎవరైనా ఎటువంటి అరాచకానికి పాల్పడిన ఈ డిజిటల్ బుక్లో ఎంటర్ చేయాలన్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పిన్నింటి తమ్మినాయుడు, పతివాడ అప్పలనాయుడు, ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సుందర హరీష్రావు, కోరాడ కోటి నాయుడు, బుగత రమణ, వైసిపి అంగన్వాడి జిల్లా అధ్యక్షులు పతివాడ కృష్ణవేణి, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

గజపతినగరం: కూటమి పాలనలో అన్యాయానికి గురైన వైసిపి కార్యకర్తలు, సామాన్య ప్రజల కోసం తమ నాయకుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ లాంచ్ చేశారని ఇది కార్యకర్తలకు అండగా పనిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సియ్య స్పష్టం చేశారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలో డిజిటల్ బుక్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి శ్రేణులను ఇబ్బంది పెట్టే వారికి భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని, పార్టీ అధినేత జగన్ మోహన్రెడ్డితో పాటుగా తానూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మూడు నెలల్లో జరగబోయే గ్రామస్థాయి నుంచి స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి గార తౌడు, రౌతు రాజేశ్వరి, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, నాయకులు కరణం ఆదినారాయణ, బెల్లాన త్రినాథ రావు, మండల సురేష్, సర్పంచ్ కర్రీ లక్ష్మణరావు, పైడిపునాయుడు ఐదు మండలాల ఎంపిపిలు, జెడ్పిటిసిలు పాల్గొన్నారు.

కలిసి పనిచేద్దాం : ఎమ్మెల్యే

ఘనంగా ఎఎంసి నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -పూసపాటిరేగ

కలిసి పని చేద్దాం అభివృద్ధిని సాధిద్దామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాదవి అన్నారు. ఆదివారం మండలంలోని ఎఎంసీ కార్యాలయంలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులుగా గేదెల గాయత్రి, ఉపాధ్యక్షులుగా బాసి దుర్గతో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాయకుల మధ్య విభేదాలు సృష్టించాలని వైసిపి నాయకులు చూస్తున్నారని ఆరోపించారు. వైసిపి ట్రాప్లో ఎవరూ పడొద్దని ఆమె సూచించారు. మనందరం కలిసి పని చేసి అభివృద్ధిని సాధిద్దామని చెప్పారు. ఎపి మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు మాట్లాడుతూ నూతన పాలకవర్గం నియోజకవర్గ రైతాంగానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పడిన కమిటీ చేసిన పరిపాలనలా కాకుండా, పూసపాటిరేగ ఎఎంసీ చరిత్రలోనే ఈ పాలకవర్గం ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతుందన్నారు. చైర్పర్సన్ గేదెల గాయత్రి మాట్లాడుతూ మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నం నాయుడు, విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, నియోజకవర్గ టిడిపి పరిశీలకులు ఎండి నజీర్, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్రావు, మాజీ జెడ్పిటిసి పతివాడ అప్పలనారాయణ, ఆకిరి ప్రసాద్ రావు, బిజెపి ఇంచార్జి బుర్లె శ్రీధర్, టిడిపి బోగాపురం, నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ మండలాల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, కడగల ఆనంద్కుమార్, మహంతి శంకరరావు, పల్లె భాస్కరరావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే మాధవి, మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు

బదిలీలు నిరంతర ప్రక్రియ: డీన్

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి యాజమాన్యానికి బొబ్బిలి, రామతీర్థం, విజయనగరం, విజయనగరం రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో హెల్త్ సెంటర్లు ఉన్నాయని, వీటిలో వైద్య సేవలు అందించేందుకు పనిచేస్తున్న వారిని బదిలీలు చేయడం నిరంత ప్రక్రియ అని మిమ్స్ డీన్ డాక్టర్ ప్రవీణ్కుమార్ ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ క్రమంలోనే బొబ్బిలి హెల్త్ సెంటర్లో మహిళా రోగులకు వైద్య సేవలు అందించే నిమిత్తం నైపుణ్యం గల ఆయాను బదిలీ చేసే క్రమంలో విజయనగరం హెల్త్ సెంటర్ నుంచి బొబ్బిలి హెల్త్ క్లినిక్కు ఎడ్ల గౌరిని బదిలీ చేశామన్నారు. ఆమె ఈ బదిలీ ఉత్తర్వులు తీసుకోవడానికి నిరాకరిస్తూ, సహాయ నిరాకరణ చేస్తూ బొబ్బిలిలో మహిళా రోగులకు సేవలు అందించాలనే విషయాన్ని విస్మరిస్తూ బయట వ్యక్తుల ప్రోద్బలంతో బెదిరింపు చర్యలకు పాల్పడిందని ఆరోపించారు. అందులో భాగంగా ఆత్మహత్యకు పాల్పడతానని బెదిరించి పురుగుల మందు సేవించడానికి ప్రయత్నిస్తూ ఆత్మహత్యకు ప్రయత్నించిందని చెప్పారు. గతంలో సంస్థకు వ్యతిరేకంగా కార్యకలాపాలు నడిపిన బయట వ్యక్తులు నిజ నిజాలు తెలుసుకోకుండా ఈ నెపంతో ప్రశాంతంగా నడుస్తున్న మిమ్స్లో మళ్లీ యాజమాన్యానికి సిబ్బందికి మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అప్పటి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ధిక్కరించి గతంలో కరోనా సమయంలో ఉద్యోగులతో బలవంతంగా ధర్నాలు చేయించి వారి ఉద్యోగాలు కూడా కోల్పోవడానికి సిఐటియు నాయకుడు టివి రమణ కారణమని ఉద్యోగులు వాపోయారని, ప్రస్తుతం కూడా చట్ట వ్యతిరేక కార్యకలాపాలను బయట వ్యక్తులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మిమ్స్లో పనిచేసిన బి.సూర్య నారాయణ అనే డ్రైవర్ మద్యానికి బానిసై అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటనను కూడా మిమ్స్కు ఆపాదించడంలో బయట వ్యక్తుల దురుద్దేశం తేటతెల్లమవుతుందని చెప్పారు. గౌరీ వైద్య సౌకర్యం నిమిత్తం యాజమాన్యం వైద్య ఖర్చులు చెల్లించడానికి వెళితే సదరు వ్యక్తులు సిబ్బందిని బయటకు గెంటివేశారని, సంస్థను, సంస్థపై ఆధార పడ్డ ఉద్యోగులను కాపాడుకునే ప్రయత్నంలో యాజమాన్యం ఇటువంటి దుష్ప్రచారాన్ని అంగీకరించదని ఈ విషయంలో అన్ని రకాల చట్టపరమైన చర్యలూ తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

స్మార్ట్ పోలీసింగ్తో మెరుగైన సేవలు : ఎస్పి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

స్మార్ట్ పోలీసింగ్తో ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎస్పి ఎఆర్ దామోదర్ సూచించారు. ఆదివారం విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషన్ను సందర్శించారు. పోలీసు సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించడంతోపాటు వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పోలీసు స్టేషనుకు వచ్చే బాధితులు, వద్దులు, మహిళల పట్ల అప్యాయంగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 2వ పట్టణ పోలీసు స్టేషను పరిసరాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయని, భవిష్యత్తులో ఐఎస్ఒ సర్టిఫికేటు లభించే అవకాశం, అర్హత ఉన్నందున, మరింత సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. స్టేషను నుండే పర్యవేక్షించే విధంగా చేసేందుకు కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయడాన్ని ప్రశంసించారు. స్టేషనులో రికార్డులు, సిడి ఫైల్స్ ను, కోర్టు మోనటరింగు విధులను సక్రమంగా నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిని అభినందించి, వారికి రివార్డులను అందజేసారు. పోలీసు స్టేషన్లలో దర్యాప్తులో ఉన్న వివిధ కేసులను, రికార్డులను పరిశీలించి, ఆయా కేసుల్లో దర్యాప్తును పూర్తి చేయాలని, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎస్పి వెంట సిఐ టి.శ్రీనివాసరావు, ఎస్ఐలు కృష్ణమూర్తి, చంద్ర, కనకరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోపణలు సబబు కాదు '

ప్రజాశక్తి- శృంగవరపు కోట

మండలంలోని మూల బొడ్డవర పంచాయతీ పరిధిలో జిందాల్ భూ నిర్వాసితుల కోసం గ్రామసభ నిర్వాహణకు మార్గదర్శకాలు ఇవ్వాలని కలెక్టర్, డిపిఒను కోరునట్లు ఆ గ్రామ సర్పంచ్ దేవాపురపు మీన తెలిపారు. గ్రామ సభ ఏర్పాటు చేయడం లేదని పంచాయతీ సెక్రెటరీ బంగారునాయుడుకు శనివారం కొంతమంది జిందాల్ బాధితులు ఇచ్చిన ఫిర్యాదునకు స్పందించి ఆదివారం ఆమె బొడ్డవరలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసినట్లు తెలియగా 2006లో ఇచ్చిన పంచాయతీ తీర్మానంలో గల అంశాలను నెరవేర నందున రైతుల కోరిక మేరకు మరోసారి గ్రామ సభ పెట్టేందుకు వీలవుతుందా లేదా అని ఈనెల 22వ తేదీన జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారిని కలిసి వినతి పత్రాలు అందజేశామని స్పష్టం చేశారు. అధికారుల నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు వచ్చిన వెంటనే గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. ఇంతలో ఈ ప్రాంతాన్ని శాసిస్తున్న నాయకులు కొందరు వ్యక్తులతో తనపై లేనిపోని ఆరోపణలు చేయించడం సబవు కాదని ఆమె అన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

బాపూజి సేవా సంఘం ఆధ్వర్యంలో నవయుగ కవి గుర్రం జాషువా 131వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ మాట్లాడుతూ సమాజంలో కులవివక్ష, మతతత్వం, మహిళల హక్కుల అణిచివేత, శ్రమదోపిడి తదితర దురాగతాలపై తన కవిత్వం ద్వారా జాషువా ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జియో వ్యవస్థాపకుడు రామకృష్ణ, వార్డు సభ్యుడు చిప్పాడ శేషగిరిరావు, మెపాడ చిన్ని కృష్ణ, దొడ్డి సూర్యారావు, బొండా వెంకటరమణ, వసంత వెంకటరమణ, గనివాడ వల్లయ్య, బాలి రామకృష్ణ, బర్ల స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: అంబేద్కర్ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో బొబ్బిలి పట్టణంలో గల గెస్ట్ హౌస్ కాలనీలో ఆదివారం సాహిత్య సభ, ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత వైద్య శిబిరాన్ని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ ప్రారంభించారు. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు మరికొన్ని సంస్థలకు ప్రేరణ కలిగిస్తాయని ప్రశంసించారు. మహారాజా వైద్య విజ్ఞాన సంస్థకు చెందిన పలు విభాగాల అధిపతులు, నిపుణులు, రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు, ప్రత్యేక అవసరం గలవారికి మిమ్స్లో మెరుగైన వైద్యం అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సాహిత్య పీఠం అధ్యక్ష కార్యదర్శులు సోరు సాంబయ్య, బొద్దాన అప్పారావులతో పాటు టిడిపి గెంబలి శ్రీనివాసరావు, సుంకరి సాయి రమేష్, స్థానిక కౌన్సిలర్ తెంటు పార్వతి, మదర్ థెరిసా ట్రస్ట్ అధ్యక్షులు క్లైవ్ కూపర్, ఆదినారాయణ, మిరియాల సురేష్ కుమార్, మరడ లక్ష్మ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిఎస్సిలో బిసి స్టడీ సర్కిల్ విజయకేతనం

19 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక
అభినందించిన డిబిసిడబ్ల్యుఒ జ్యోతిశ్రీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మట్టిలో మాణిక్యాలను వెలికితీసి సానబెట్టి, వారిని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దింది ప్రభుత్వ ఆధ్వర్యంలోని గురజాడ అప్పారావు బిసి స్టడీసర్కిల్. ప్రభుత్వం అందించిన శిక్షణను సద్వినియోగం చేసుకొని, తమలోని ప్రతిభకు పదును పెట్టి, డిఎస్సిలో స్టడీ సర్కిల్ విద్యార్థులు 19 మంది అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. వీరంతా ఇటీవల రాష్ట్ర రాజధానిలో ఉపాధ్యాయ నియామక పత్రాలను అందుకొని, బిసి స్టడీసర్కిల్ కు, బిసి సంక్షేమ శాఖకు మంచి పేరు తెచ్చారు. గురజాడ అప్పారావు బిసి స్టడీసర్కిల్ ద్వారా జిల్లాలో మొత్తం 228 మంది అభ్యర్థులకు స్థానిక కస్పా హైస్కూల్ ప్రాంగణంలో ప్రభుత్వం డిఎస్సి శిక్షణ ఏర్పాటు చేసింది. వీరికి ఉచితంగా 60 రోజులపాటు శిక్షణ ఇవ్వడమే కాకుండా, స్టైఫండ్, స్టడీ మెటీరియల్ కొనుగోలు చేయడానికి కూడా నగదు అందించి ప్రోత్సహించింది. దీనిని సద్వినియోగం చేసుకున్న 19మంది అభ్యర్థులు మెగా డిఎస్సిలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరందరినీ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారిణి జ్యోతిశ్రీ తమ కార్యాలయానికి పిలిచి అభినందించారు. బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపికైన అభ్యర్థులను అభినందిస్తున్న జ్యోతి శ్రీ

భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

భగత్ సింగ్ స్ఫూర్తిగా కార్మికులు, కర్షకులు ఉద్యమించాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు నాయకులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం జరజాపుపేట అమర వీరుల స్థూపం వద్ద భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన భగత్ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడారు. బ్రిటిష్ దొరల పాలనకు వ్యతిరేకంగా చిన్న వయసులో ఉరికంబం ఎక్కిన భగత్ సింగ్ను ఆదర్శంగా తీసుకొని కార్మికులు, కర్షకులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా భగత్ సింగ్ ఆనాడు తెల్ల దొరలు పాలన పారదోలితే ప్రస్తుతం పాలిస్తున్న పాలకులు కార్పొరేట్లకు దేశాన్ని తాకట్టు పెట్టి దోచుకుంటున్నారని ఆరోపించారు. నేటి యువత భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్లు స్వాతంత్ర్య పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని నల్ల దొరల పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సుంకర సన్యాసి రావు, బొలే కృష్ణమూర్తి, కనకల సూర్యనారాయణ, మద్దిల ఆదినారాయణ, కిల్లంపల్లి రామకృష్ణ, పల్ల రాము తదితరులు పాల్గొన్నారు.

రుషింగి యువకుడికి డాక్టరేట్

వంగర: మండలంలోని రుషింగి గ్రామానికి చెందిన శీలంక గోవింద రావుకు డాక్టరేట్ లభించింది. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో ఆచార్య ఆర్ రాజేశ్వరమ్మ పర్యవేక్షణలో శ్రీకాకుళం జిల్లా కవిత్వం.. పరిశీలన అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందినట్లు జన విజ్ఞాన వేదిక, యుటిఎఫ్ రాష్ట్ర కల్చర్ కమిటీ మెంబర్ కొండపల్లి గౌరునాయుడు ఆదివారం తెలిపారు. ఆయన తల్లిదండ్రులు కూలి పని చేసుకుని చదివించారు. గోవిందరావు గ్రామంలో డాక్టరేట్ పొందిన మొదటి యువకుడు కావడంతో జన విజ్ఞాన వేదిక, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ప్రలోభాలకు లోనై పార్టీ ఫిరాయింపు

బాడంగి: మండలంలోని గూడెపువలస ఎంపిటిసి పూడి సింహాచలం వైసిపి బీఫార్మ్ మీద గెలిచి పార్టీ ద్వారా చాలా లబ్ధి పొంది కూటమి ప్రభుత్వ ప్రలోభాలకు లోనై పార్టీ ఫిరాయించారని వైసిపి మండల అధ్యక్షులు యామలి శివప్రసాద్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఒక పార్టీ గుర్తు మీద గెలిచి వేరే పార్టీకి మారడం సిగ్గుచేటని భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. గతంలో కోడూరు ఎంపిటిసి-2 మరిపి శ్రీదేవి కూడా వైసిపి బీఫారం మీద గెలిచి స్వప్రయోజనాల కోసం పార్టీ మారడం మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో వైసిపి మండల యూత్ ప్రెసిడెంట్ బేతనపల్లి శంకర్రావు, ఎంపిపి ప్రతినిధి తెంటు మధుసూదన్ రావు, నియోజకవర్గం విద్య విభాగ అధ్యక్షులు తెంటు తిరుపతిరావు, తోట రాజశేఖర్, పూడి బాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా తూముల జన్మదిన వేడుకలు

బొబ్బిలి: వైసిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ సభ్యులు తూముల భాస్క రరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన స్వగృహంలో ఆదివారం వైసిపి కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, అభిమానులు సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. వైసిపి కౌన్సిలర్లు పాలవలస ఉమా శంకర్, ఇంటి గోవిందరావు, కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు జెసి రాజు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

పాము కాటుతో గేదె మృతి

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ గ్రామానికి చెందిన రౌతు ఈశ్వరరావుకు చెందిన పాడి గేదె రాత్రి కళ్లం నుంచి తప్పించుకుని పొలంలోకి వెళ్లింది. అక్కడ పాముకాటుకు గురై స్పృహ తప్పి కళ్ళం దగ్గరకు వచ్చి పడిపోయింది. ఉదయం వెళ్లి చూసేసరికి మృతి చెంది కనిపించింది. సుమారు రూ.1.20లక్షల విలువ చేసే పాడి గేదె చనిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ గేదెకు బీమా ఉండడంతో క్లెయిమ్ చేసి బాధితురాలికి సహాయం అందిస్తామని విశాఖ డైరీ సూపర్వైజర్ నాయుడు, పాలు ప్రెసిడెంట్ దేముడునాయుడు తెలిపారు.

మహారాజశ్రీ బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.48/2019

Between:
ఏగిరెడ్డి దుర్గ ....వాది
And:
అల్లు నారాయణ వగైరాలు ......ప్రతివాదులు
To:
ప్రతివాది నెం.9: పూడి పైడితల్లి, W/o.తిరుపతిరావు, వయస్సు 40 సం.లు, రావివలస గ్రామము, బాడంగి మండలం, విజయనగరం జిల్లా,

పై నెంబరు కేసులో వాది ఆస్తి పంపకము కొరకు ఇందలి ప్రతివాదులు పై కోర్టులో దాఖలు చేయగా శ్రీ కోర్టువారు ప్రతివాది నెం.9 హాజరు నిమిత్తము **తేది.15.10.2025కి** వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా దినమున మీరు స్వయముగాగాని, వకీలు ద్వారా గాని పై తేదీన **ఉదయం గం.10.30ని.ల**కు పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేనియెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియచేయడమైనది.

పై కోర్టువారు ఆర్డర్ ప్రకారం.

ఇట్లు
M.సింహాచలం
న్యాయవాది, బొబ్బిలి.
సెల్ నెం. 9440963385

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.3/2024, O.S.4/2012

Between:
చింత కృష్ణ వగైరాలు .....D.Hrs
And:
చింత గోపాలం వగైరాలు ......J. Drs
To:
ప్రతివాది నెం.4 : చింత కూర్మినాయుడు, S/O. సత్యం, వయస్సు 72 సం.లు, S.చింతలవలస గ్రామం, రామభద్రపురం మండలం, విజయనగరం జిల్లా.
ప్రతివాది నెం.6 : వసంతల సన్యాసి రావు, S/O. చిన్నంనాయుడు, వయస్సు 67 సం.లు, రామభద్రపురం గ్రామం మరియు మండలం, విజయనగరం జిల్లా.
ప్రతివాది నెం. 8 : కర్రి సావిత్రమ్మ, W/o. లేట్ లక్ష్మ, వయస్సు 67 సం.లు, S. చింతలవలస గ్రామం, రామభద్రపురం మండలం, విజయనగరం జిల్లా.
ప్రతివాది నెం. 9 : పట్నాన సత్తెమ్మ, W/O. లేట్ లక్ష్మ, వయస్సు 67 సం.లు, S.చింతలవలస గ్రామం, రామభద్రపురం మండలం, విజయనగరం జిల్లా.
ప్రతివాది నెం. 10 : తాలచుట్ల తిరుపతమ్మ, W/o. సింహాచలం, వయస్సు 30 సం.లు, S. చింతలవలస గ్రామం, రామభద్రపురం మండలం, విజయనగరం జిల్లా,
ప్రతివాది నెం. 11 : కర్రోతు రవణమ్మ, W/o. వెంకటరమణ, వయస్సు 37 సం.లు, S.చింతలవలస గ్రామం, రామభద్రపురం మండలం, విజయనగరం జిల్లా.
ప్రతివాది నెం.13: చింత రమణ, S/o. లేటు గోపాలం, వయస్సు 46 సం.లు, అప్పలరాజుపేట గ్రామం, బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు కేసులో D.Hrs ఆస్తి డెలివరీ కొరకు ఇందలి J.Drsపై ప్రతివాదులు పై కోర్టులో దాఖలు చేయగా శ్రీ కోర్టువారు J.Drs 4, 6, 8, 9, 10, 11 మరియు 13 హాజరు నిమిత్తము **తేది. 16.10.2025కి** వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా దినమున మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని పై తేదీన **ఉదయం గం.10.30ని.లకు** పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేనియెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా మీకు తెలియచేయడమైనది.

పై కోర్టువారు ఆర్డర్ ప్రకారం.

ఇట్లు
M.సింహాచలం
న్యాయవాది, బొబ్బిలి.
సెల్ నెం. 9440963385